క్లుప్తంగా

రాజీవ్ యువ వికాసం గడువు పొడిగింపు

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కోసం అర్హులైన యువకుల నుంచి దరఖాస్తులను కోరింది. గడువు ఈ నెల 4తో ముగియనుండగా.. తాజాగా ప్రభుత్వం 14వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ వెంకయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల కోసం మండల కేంద్రంలో, మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, వాటిలో నేరుగా వెళ్లి దరఖాస్తులు అందించాలని కోరారు.

కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా రోహిత్‌రెడ్డి


నియామకపత్రం అందుకుంటున్న రోహిత్‌రెడ్డి

కొందుర్గు: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని శ్రీరంగాపూర్‌కు చెందిన బీమిడి రోహిత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి రోహిత్‌రెడ్డికి నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు రైతుల అభ్యున్నతికి, పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ మహిళా మండల కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న మహిళా నాయకురాళ్లు

కేశంపేట: మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా గుండె రాణి ఎన్నికయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని మహిళా నాయకులు మండల కేంద్రంలో సమావేశమై నూతన కాంగ్రెస్ మండల మహిళా కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా ఆస్మా, ప్రధాన కార్యదర్శిగా అరుణ, కార్యదర్శిగా లక్ష్మీదేవి, కోశాధికారిగా నర్సమ్మ, గౌరవ అధ్యక్షురాలిగా చెర్ర చెన్నమ్మను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లలిత, సుజాత, సువర్ణ, యాదమ్మ, మాణెమ్మ, అరుణమ్మ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎంపీడీఓ బన్సిలాల్

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బన్సిలాల్ కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ మీడియాతో మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 5వరకు అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ గడువును ఈ నెల 14 వరకు పొడిగించిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని యువత ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ సదావకాశాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రూప్-1లో మెరిసిన యువకుడికి సన్మానం


మల్లేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలోని గుర్రంగుట్ట కాలనీకి చెందిన కావటి యాదయ్య, పార్వతమ్మ దంపతుల కుమారుడు మల్లేశ్‌యాదవ్ గ్రూప్-1లో ప్రతిభ చూపి మంచి ర్యాంకు సాధించారు. ఆయన ఇదివరకే మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై సత్తాచాటగా.. తాజాగా వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో మెరిట్ లిస్ట్‌లో రాష్ట్రస్థాయి 187వ ర్యాంకు సాధించాడు. మల్టీజోన్-2 విభాగంలో 92వ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, మాజీ ఎంపీపీ లలితవెంకటయ్యలు అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శ్రీశైలం, విజయ్‌కృష్ణ, నర్సింహ, మాజీ సర్పంచ్ బక్కి కుమార్, గిరి, శ్రీనివాస్, కరుణకర్, భరత్, శ్రీను, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం.. ప్రజల మురిపెం

ఉత్సాహంగా ప్రారంభమైన బియ్యం పంపిణీ

- రేషన్ దుకాణాల వద్దకు బారులు తీరిన లబ్ధిదారులు
- హర్షం వ్యక్తం చేసిన ప్రజలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఉదయం నుంచే దుకాణాల వద్ద లబ్ధిదారులు క్యూ కట్టారు. దీంతో రేషన్ షాపుల వద్ద సందడి నెలకొంది. అనంతరం సన్న బియ్యం పొంది హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడం బాగుందని ప్రజలు, నాయకులు హర్షించారు. ఆయా దుకాణాల్లో మొదటిరోజు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేశారు.


మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ రేషన్ షాపు వద్ద బారులుతీరిన లబ్ధిదారులు


కేశంపేట: సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఆహార భద్రతకు పెద్దపీట

షాద్‌నగర్: నిరుపేదలు తృప్తిగా అన్నం తినేందుకే ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో ఉన్న రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆహార భద్రతకు పెద్దపీట వేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా ఒక్కరికీ కూడా కొత్తగా రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే ఇచ్చిన హామీ మేరకు అర్హులుగా ఉన్న ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా నాణ్యతగా ఉన్న సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

కొత్తూరు: రాజకీయాలకతీతంగా కొత్తూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరులో మంగళవారం ఆయన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొత్తూరులో ప్రస్తుతం చేపడుతున్న రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను రాజకీయాలకతీతంగా పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్‌ను ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ సరిత, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కేశంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వర్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, యాదయ్య యాదవ్, భాస్కర్‌గౌడ్, రూప్లానాయక్, అమీర్, తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీఓ రవిచంద్ర కుమార్‌రెడ్డి, ఆర్‌ఐ నివేదిత తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

కొందుర్గు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అంతకు ముందు కొందుర్గులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రమేశ్‌కుమార్, జగదీశ్వర్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు కృష్ణారెడ్డి, కావలి రాజు, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: సన్నబియ్యం కార్యక్రమాన్ని మండల కేంద్రమైన నందిగామలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం


షాబాద్: లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

షాబాద్: నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, నిరుపేదలు ఆకలితో పస్తులు ఉండకూడదనే ఉద్దేశంతో సన్నబియ్యం పథకం ప్రవేశపెట్టిందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని హైతాబాద్, పోతుగల్, అంతారం, లక్ష్మారావుగూడ గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రామ్, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు పామెన నర్సింలు, మంగలి చెన్నయ్య, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీరాంరెడ్డి, నర్సింలుగౌడ్, సంజీవరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

బారులు తీరిన లబ్ధిదారులు


చేవెళ్ల: ఆలూరులో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

చేవెళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో మొత్తం 42 రేషన్ దుకాణాలు ఉండగా.. 16,304 రేషన్‌కార్డుల ద్వారా 2,96,646ల క్వింటాళ్ల కోటాను ప్రతినెల అందిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రేషన్ దుకాణాల్లో మొదటిరోజు బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు పెద్దసంఖ్యలో వచ్చారు. అన్ని గ్రామాల్లో సన్నబియ్యం సందడి కనిపించింది.

రేషన్ దుకాణాల వద్ద క్యూ


మొయినాబాద్: అజీజ్‌నగర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో గల రేషన్ దుకాణాల్లో నాయకులు, డీలర్లు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. మంగళవారం సన్నబియ్యం పంపిణీ మొదటిరోజు కావడంతో లబ్ధిదారులు బారులుతీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రేషన్ డీలర్లు బియ్యాన్ని పంపిణీ చేస్తుండడంతో క్యూలో నిలబడి ఆసక్తిగా బియ్యం తీసుకెళ్తూ సంతోషం వ్యక్తం చేశారు.

బాకారంలో..

మండల పరిధిలోని బాకారం గ్రామంలో సన్న బియ్యం పథకాన్ని నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, బాకారం తాజా మాజీ ఉపసర్పంచ్ ఎలిగేపల్లి శ్రీనివాస్‌యాదవ్, జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, బాకారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంది అనిల్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మొత్తం 28 దుకాణాల్లో..

మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపాలిటీ, మండలంలో కలిపి మొత్తం 28 రేషన్ షాపులు ఉన్నాయి. మొదటిరోజు అన్ని రేషన్ షాపులకు 25 క్వింటాళ్ల చొప్పున సన్నబియ్యం రావడంతో డీలర్లు వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సన్న బియ్యం తీసుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజాపాలన ముసుగులో పోలీస్ రాజ్యం

సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్

చేవెళ్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పోరాటాల మీద నాయకుల మీద నిర్బంధం పెరిగిందని ప్రజాపాలన ముసుగులో పోలీస్ రాజ్యం చేస్తోందని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. చేవెళ్లలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు అనేక మాయమాటలు చెప్పి కేసీఆర్ నియంత అని మేం ప్రజాస్వామ్యవాదులమని ప్రజలను నమ్మించి ఎన్నికల్లో గెలిచారన్నారు. అధికార పీఠం ఎక్కిన వెంటనే రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరించటం సరికాదన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను యూనివర్సిటీకే చెందేటట్లుగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

ముందస్తు అరెస్టులపై మండిపాటు

పోలీసులు ముందస్తు అరెస్ట్‌లతో ఉద్యమాలను ఆపలేరని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ అన్నారు. చేవెళ్లలో వారిని పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూముల వేలానికి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు ధర్నాకు పిలుపునిచ్చాయని, ధర్నాకు వెళ్లకుండా ముందస్తు అరెస్ట్‌లు చేయటం సరైనది కాదన్నారు. భూములను యూనివర్సిటీకే అందించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, చందు, రమేశ్, తదితరులు ఉన్నారు.

డప్పు కృష్ణ ఆశయ సాధనకు కృషి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు


డప్పు కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: కులవివక్ష నిర్మూలనకు కృషి చేసి ఉద్యమాన్ని నడిపించిన డప్పు కృష్ణ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కామ్రేడ్ డప్పు కృష్ణ 12వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు డప్పు కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. రైతుల కోసం భూ ఉద్యమంలో, ఇళ్ల స్థలాల ఉద్యమంలో ఆయన ఎంతో కీలకంగా వ్యవహరించారన్నారు. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి, అంటరానితనాన్ని రూపుమాపడం కోసం జరిగిన ఉద్యమంలో డప్పు కృష్ణ చురుకైన పాత్ర పోషించారన్నారు. అదేవిధంగా పేదలకు ఇళ్లు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ప్రజలను చైతన్యపరిచి గ్రామాల్లో డప్పు కృష్ణ సైకిల్ యాత్ర నిర్వహించారన్నారు. కులవివక్ష నిర్మూలనకు ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్‌నాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు


నిరసన తెలుపుతున్న బీసీసేన నాయకులు

షాద్‌నగర్: ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరుతున్న నాయకులను అక్రమ అరెస్టులు చేసి ఉద్యమాన్ని ఆపాలని చూస్తే సహించేదిలేదని వివిధ పార్టీల నాయకులు మండిపడ్డారు. హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) భూముల అమ్మకాన్ని నిరసిస్తూ మంగళవారం వివిధ పార్టీల నాయకులు చేపట్టిన చలో హెచ్‌సీయూ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. బీజేపీ, సీపీఎం, బీసీసేన నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ.. సర్కారు ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే అమ్మకానికి పెట్టడం సరికాదన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో వేల కోట్ల రూపాయల అప్పులు చేసి అభివృద్ధి చేపట్టకుండా నిధులను దారి మళ్లించిందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను తట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టి ప్రజలను మోసం చేస్తుందన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని సెంట్రల్ యూనివర్సిటీని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హెచ్‌సీయూ భూముల అమ్మకం నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూములను కాపాడటం కోసం వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు ఐక్య పోరాటాలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ నాయకులు అందె బాబయ్య, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, సీపీఎం నాయకులు రాజు, శ్రీనునాయక్, ఈశ్వర్‌నాయక్, గోపాల్, బీసీసేన నాయకులు ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

పన్నుల వసూలు 78.84శాతం

- షాద్‌నగర్‌లో రూ.5.69కోట్లు, కొత్తూరులో రూ.2.40కోట్లు
- ముగిసిన ఆర్థిక సంవత్సరం



షాద్‌నగర్: గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపాలిటీల్లో భారీగా ఆస్తి పన్నులు వసూలు అయ్యాయి. పన్నుల వసూలు కోసం అధికారులు గత నెలరోజుల పాటు ఎంతో శ్రమించారు. సెలవు రోజుల్లో కూడా కార్యాలయాల్లో పన్నులు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి పన్నులు వసూలు చేశారు. షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా సిబ్బందిని నియమించి పన్నులు వసూలు చేశారు.

షాద్‌నగర్‌లో పన్నుల వసూలు ఇలా..

షాద్‌నగర్ మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులు ఉన్నాయి. సుమారు 70 వేలకుపైగా జనాభా ఉన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 15,933 గృహ, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఆస్తి, నల్లా పన్నులు సుమారుగా రూ.7 కోట్ల 22 లక్షల 40 వేల పన్నులు వసూలు కావాల్సి ఉండగా.. గత ఆర్థిక సంవత్సరం మార్చి 31 నాటికి రూ.5 కోట్ల 69 లక్షలకుపైగా పన్నులు వసూలు అయ్యాయి. మున్సిపాలిటీలో మొత్తం 78.84 శాతం పన్నులు వసూలు అయినట్లు అధికారులు తెలిపారు.

కొత్తూరులో 80శాతం..

కొత్తూరు మున్సిపాలిటీలో మొత్తం 13,200 జనాభా ఉన్నారు. ఇందులో 2,619 ఇళ్లు, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. అయితే వీటి నుంచి సుమారు 3కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉండగా.. రూ.2.40కోట్లు మాత్రమే వసూలు అయ్యాయి. మొత్తం 80 శాతం పన్నులు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఇవీ బకాయిలు..

పన్నులు వసూలు చేసేందుకు షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీల్లో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీల పరిధిలోని వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ఫంక్షన్ హాళ్లు, పరిశ్రమలు, ఇళ్ల నుంచి పన్నులు వసూలు చేశారు. సెలవు రోజుల్లో కూడా కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి పన్నులను వసూలు చేశారు. అయినా గత ఆర్థిక సంవత్సరానికిగాను షాద్‌నగర్ మున్సిపాలిటీలో రూ.1.52కోట్లు, కొత్తూరులో రూ.60లక్షలు పన్నులు వసూలు కావాల్సి ఉంది.

రూ.5.69 కోట్లు వసూలు చేశాం



గత ఆర్థిక సంవత్సరం మార్చి 31నాటికి 78.84శాతం పన్నులు వసూలు చేశాం. మొత్తం రూ.7.22కోట్లకుగాను రూ.5.69 కోట్లు వసూలు అయ్యాయి.

– సునీత, కమిషనర్, షాద్‌నగర్ మున్సిపాలిటీ

సమస్యల పరిష్కారానికి కృషి

చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

చేవెళ్ల: కోర్టుల్లో న్యాయవాదుల సమస్యలు, కోర్టు సమస్యలను పరిష్కరించుకునేందుకు బార్ అసోషియేషన్ తరఫున కృషి చేస్తామని చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల కోర్టులోని బార్ అసోసియేషన్‌లో మంగళవారం నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాదులు రవిశంకర్‌గౌడ్, పాండురంగారెడ్డి నూతన కమిటీకి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అందరం కలిసి చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్‌ను అభివృద్ధి చేసుకుందామన్నారు. నూతన కమిటీలో బాధ్యతలు స్వీకరించిన వారిలో ఉపాధ్యక్షులు కృష్ణగౌడ్, నర్సింలు, ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి యాదగిరిగౌడ్, ట్రెజరర్ రవీందర్‌రెడ్డి, లైబ్రేరియన్ మల్లేశం, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి, మహిళా ప్రతినిధి గీతా వనజాక్షి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు యాదయ్య, ప్రదీప్‌రెడ్డి, ప్రశాం, శివరాజ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ బాటలోనే రేవంత్ ప్రభుత్వం

- హెచ్‌సీయూ భూముల ఆక్రమణను నిలిపివేయాలి
- సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్


మొయినాబాద్: పోలీస్ స్టేషన్ వద్ద సీపీఐ నాయకుడు

మొయినాబాద్: అక్రమ అరెస్టులు, పోలీసుల దాడులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల ఆక్రమణపై విద్యార్థుల నిరసనల సందర్భంగా సీపీఐ నాయకులను మంగళవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌ను ఉదయం 6 గంటలకే ఇంటి వద్ద అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూముల ఆక్రమణను నిరసిస్తూ ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హెచ్‌సీయూకి సంబంధించిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తుందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాక్కోవడమంటే పేద విద్యార్థుల చదువులను ధ్వంసం చేయడమేనని మండిపడ్డారు. భూముల అమ్మకం విషయంలో కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి వెళ్తున్నారని విమర్శించారు. భూముల అమ్మకాలు, అక్రమ అరెస్టులపై కాకుండా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి పెట్టాలన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు


కేశంపేట: పోలీసుల అదుపులో ఉన్న నాయకులు

కేశంపేట: హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ భూముల విషయంపై వివిధ పార్టీల నాయకులు చలో హెచ్‌సీయూకి పిలుపునివ్వడంతో మండల బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం ఉచిత హామీలను ఇచ్చిందని అందుకోసమే హెచ్‌సీయూ భూములను అమ్మకానికి పెట్టిందన్నారు. యూనివర్సిటీ భూముల దగ్గరికి రాష్ట్ర ప్రభుత్వం వస్తే బీజేపీ విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తుందన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని నిర్బంధాలను చేస్తూ ఉద్యమాలను ఆపలేరన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షులు నర్సింహాయాదవ్, రఘురాంగౌడ్, మహేశ్, నర్సింలు, నర్సింహ, విఠల్‌గౌడ్, శ్రీనివాస్, శివాజీ, పాండు, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.